# హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 158 | పేజీలు : 08 | మంగళవారం | 16-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## మెట్రో రుణం ఆపేసిన కిషన్ రెడ్డి

**ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలో జమయిన మొత్తాన్ని ఇవ్వకుండా నిలిపేశారు**

**రేవంత్ అడిగినవన్నీ చేసేస్తే తెలంగాణలో బీజేపీ ఉండాలా వద్దా!?**

**కేంద్ర మంత్రులు ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లతో ఆయన అన్న మాటలివే**

**సగం ధరకే మెట్రో స్వాధీనం.. 4 శాతం వడ్డీకే రుణం తెస్తున్నాం**

**అందుకే కేటీఆర్‌తో కలిసి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారు**

**మెట్రో విస్తరణకు అన్ని రాష్ట్రాలకు 50 శాతం నిధులిస్తున్న కేంద్రం**

**తెలంగాణపై మాత్రం వివక్ష.. అందుకే ఆయన వెంట పడుతున్నాం**

**కూలేశ్వరం కట్టిన కేసీఆర్‌కు 3.15 లక్షల కోట్ల నిధులు ఇప్పించారు**

**కిషన్‌రెడ్డీ.. నిధులు విడుదల చేయిస్తారా లేదా? ఎన్వోసీ ఇప్పిస్తారా?**

**మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీత**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ స్వాధీనం కోసం రాష్ట్రానికి రావాల్సిన రుణాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆపేశారని, జపాన్ నుంచి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ఖాతాలో జమయిన రూ.13,600 కోట్లను తెలంగాణ ప్రభుత్వానికి ఇవ్వకుండా నిలిపివేయించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెట్రో విస్తరణను కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని, కేటీఆర్‌తో కలిసి కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సచివాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించడానికి మెట్రో రైలు విస్తరణ ఎంతో అవసరం. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెట్రో విస్తరణకు నిర్ణయం తీసుకున్నాం. రెండో

## సీఎం అసమర్థత వల్లే మెట్రో రెండో దశ వెనక్కి

**'బడే భాయ్'ను మెప్పించలేని రేవంత్: కేటీఆర్**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

సభలు, సమావేశాల్లో ప్రధాని మోదీని బడే భాయ్ అంటూ పొగిడే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆయన్ను మెప్పించి మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు ఎందుకు అనుమతి సాధించలేకపోయారో చెప్పాలని బీఆర్ఎస్

## పుట్టినరోజు కానుక..

**కొత్త రేషన్ కార్డుల పంపిణీకి సీఎం విజయ్ శ్రీకారం**

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అర్హులైన

## దోసె.. మిల్లెట్ ఇడ్లీ..

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోజుకో రకం అల్పాహారం**

**రాజ్‌భవన్ పాఠశాలలో ప్రారంభించిన మంత్రి పొన్నం**

**స్వచ్ఛంద సంస్థల సహకారంతో రూ.800 కోట్లతో పథకం**

**ఈ ఏడాది నుంచి ప్రీ ప్రైమరీ తరగతులు కూడా: పొన్నం**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

పేద విద్యార్థులకు ఆకలి తెలియకుండా చేయడంతోపాటు పౌష్టికాహారాన్ని

8 రకాల వరి వంగడాలతోనే

## రైతులకు లాభాలు

**అంతర్జాతీయంగానూ డిమాండ్**

**సబ్‌కమిటీకి నివేదించిన శాస్త్రవేత్తలు**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా

## ఓటుకు నోటు ద్వారా రేవంత్ ఓటు చోరీ

**సోనియాకు ఓటు హక్కు, నెహ్రూకు ప్రధాని పదవి, ఇందిర ప్రధానిగా కొనసాగడం సీటు చోరీ కాదా!?**

**బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

"ఓటుకు నోటు ద్వారా మీరు ఓటు చోరీ చేయలేదా?" అని సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు. అబద్ధాలకు తల్లి కాంగ్రెస్ అయితే, తండ్రి రేవంత్ అని ఆరోపించారు. సీఎం వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. "ఓటు చోరీ.. సీటు చోరీ.. అంటూ మాట్లాడుతున్న కాంగ్రెస్

## 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

**విపత్తుల నిర్వహణ యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలి**

**ప్రభావిత జిల్లాల్లోజాగ్రత్తలు తీసుకోవాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశం**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. విపత్తుల నిర్వహణ యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించాక స్పందించడం కంటే.. ముందుగానే తీవ్రతను అంచనా వేసి నిరోధక చర్యలు

## వాళ్లు దేశమంతా తిరగొచ్చు నన్ను మాత్రం రానివ్వరా!?

**యువతను బలిచేసి గద్దెనెక్కారు**

**తెలంగాణ బలిదానాలు కదిలించాయి**

**నివాళులర్పిద్దామంటే అనుమతివ్వలేదు**

**తెలంగాణ అభివృద్ధికి జనసేన పనిచేస్తుంది**

**కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ సిద్ధాంత ధోరణి**

**దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులతో పోరాడతాం**

**ఢిల్లీ మెడలు వంచుతామని ప్రగల్భాలు**

**కానీ, ఇక్కడకొచ్చి తమ తలలే వంచుకుంటారు**

**దేశానికి బలమైన నాయకుడిగా ప్రధాని మోదీ**

**దేశ సమగ్రత.. సమైక్యతే జనసేన పార్టీ ఆత్మ**

**'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' పేరుతో హస్తినలో నిర్వహించిన భేటీలో పవన్**

**ఇది.. కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీకి నిదర్శనం**



హైదరాబాద్ పల్స్,డెస్క్

"భారత్ జోడో" యాత్ర పేరుతో కాంగ్రెస్ నాయకులు దేశమంతటా తిరిగి అందరినీ కలుస్తారు. కానీ, నేను తెలంగాణలో తిరుగుతానంటే మాత్రం అనుమతి ఇవ్వరు. కాంగ్రెస్ పార్టీ హిపోక్రసీ రాజకీయాలు ఆపేయాలి. నాకు తెలంగాణ యువత పోరాటాల మీద గౌరవం

## బీజేపీ చేతిలో తోలుబొమ్మ పవన్ కళ్యాణ్

**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని కించపర్చడం ఆయనకు కొత్తేమీ కాదు**

**కేసీఆర్, కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదు?**

**రెచ్చగొట్టేలా మాట్లాడితే ఊరుకోం: మహేష్**



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్... బీజేపీ ఆడిస్తున్న ఒక తోలు బొమ్మ అని టీపీసీసీ చీఫ్ మహ్హ?షగౌడ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పవన్ కళ్యాణ్ ఎలా పడితే అలా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని, అలాంటి వ్యాఖ్యలు ఆయనకు కొత్తేమీ కాదని

## టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ..

**సింగపూర్ పర్యటనలో చంద్రబాబు కీలక భేటీలు**

హైదరాబాద్ పల్స్,ఢిల్లీ

సింగపూర్ లో పర్యటిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు, సోమవారం అక్కడ కీలక సమావేశాల్లో పాల్గొన్నారు. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇవాళ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో భేటీ అనంతరం ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్-సింగపూర్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా ఏపీలోని విమానాశ్రయాల నుంచి సింగపూర్‌కు, అలాగే ఇతర ప్రాంతాలకు విమాన సర్వీసులు, ఎయిర్ కనెక్టివిటీని పెంచే అవకాశాలపై ఫలవంతమైన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందిస్తున్న అవకాశాలను సింగపూర్ విదేశాంగ మంత్రికి వివరించారు. అమరావతి రాజధాని నిర్మాణ ప్రణాళికలను, దాని భవిష్యత్ దార్శనికతను ఆయనకు తెలియజేశారు. తయారీ రంగంతో పాటు సేవల రంగంలోనూ ఆంధ్రప్రదేశ్ వేగంగా అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని తెలిపారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూమి లభ్యతతో పాటు, సేవల రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీలో పుష్కలంగా ఉన్నాయని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ

**సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ**

**విదేశీ వ్యవహారాల మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ కీలక సమావేశం**

**అమరావతి సహా అర్బన్ గవర్నెన్స్‌లో సహకారం కోరిన ముఖ్యమంత్రి**

**ఏపీ నుంచి ఆక్వా, ఉద్యాన ఉత్పత్తుల దిగుమతికి విజ్ఞప్తి**

**సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎయిర్ కనెక్టివిటీపై ఫలవంతమైన చర్చలు**





## పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

**అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ**



**అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరినట్టు ప్రకటన**

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెర దించేందుకు అవగాహన**

**హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవనున్నట్టు ప్రకటించిన ట్రంప్**

**ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ.. శాంతి నెలకొనాలని ఆకాంక్ష**

# 8 రకాల వరి వంగడాలతోనే రైతులకు లాభాలు

మొదటి పేజీ తరువాయి

అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సోమవారం ప్రజాభవన్‌లో జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశానికి.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. రైతులకు లాభదాయకమైన బీపీటీ- 5204, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్- 15048), కేఎన్ఎం- 1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, డబ్ల్యూజీఎల్- 962, డబ్ల్యూజీఎల్- 44, జేజీఎల్- 1798 అనే ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూర్‌పలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. కేంద్ర విధానాలకు అనుగుణంగానే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని మంత్రులకు అధికారులు నివేదించారు.

# ఓటుకు నోటు ద్వారా రేవంత్ ఓటు చోరీ

మొదటి పేజీ తరువాయి

నాయకులకు 'మెదడు చోరీ ' అయింది. భారత పౌరసత్వం లేకపోయినా నాడు సోనియాకు ఓటు హక్కు కల్పించడం ఓటు చోరీ కాదా? కాంగ్రెస్ అంతర్గత ఎన్నికలో సర్దార్ పటేల్‌కు మెజారిటీ ఓట్లు వచ్చినా.. ఆయనను కాదని, కేవలం రెండు ఓట్లు మాత్రమే వచ్చిన నెహ్రూను ప్రధానిగా చేయడం సీటు చోరీ కాదా? అలహాబాద్ హైకోర్టు తీర్పును సైతం పట్టించుకోకుండా ప్రధానిగా ఇందిర కొనసాగడం సీటు చోరీ కాదా?" అని నిలదీశారు. హైదరాబాద్‌లో అక్రమంగా నివాసముంటున్న 10 వేల మంది పాకిస్థానీలకు ఓటు హక్కు కల్పించాలా? అని కాంగ్రెస్, బీఆర్ఎ?సలను ప్రశ్నించారు. 'సర్' తర్వాత తెలంగాణలో దొంగ ఓట్లు, రోహింగ్యాల ఓట్లు ఉండబోవని తేల్చిచెప్పారు. "'సర్' అనేది ప్రధాని మోదీనో, కేంద్ర ప్రభుత్వమో సొంతంగా తెచ్చిన కార్యక్రమం కాదు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికల సంఘం నిర్వహించే నిరంతర ప్రక్రియ ఇది. 1951 నుంచి2002 వరకు కాంగ్రెస్ హయాంలోనూ 'సర్' జరిగింది. అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు వస్తున్నాయి?" అని ప్రశ్నించారు. 'సర్' వల్లే బెంగాల్‌లో బీజేపీ గెలిచిందని కొందరు కాంగ్రెస్ నేతలు విమర్శించడం హాస్యాస్పదమని, కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలిచినప్పుడు 'సర్' గుర్తుకు రాలేదా!? అని నిలదీశారు. బిహార్, బెంగాల్‌తోపాటు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో కూడా రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్థానీ అక్రమ చొరబాటుదారులు కొన్ని పార్టీల మద్దతుతో దొంగ ఆధార్, రేషన్ కార్డులు సంపాదించి ఓటర్లుగా నమోదవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓల్డ్ సిటీలో ఒక్కో ఇంట్లో 200 దొంగ ఓట్లు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

### వాళ్లు దేశమంతా తిరగొచ్చు

# నన్ను మాత్రం రానివ్వరా!?

మొదటి పేజీ తరువాయి

ఉంది." అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో యువతను బలిచేసి నాయకులు గద్దెనెక్కారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరులైతే వాళ్లను గుర్తించడానికి 12 సంవత్సరాలు కూడా ఇంకా సరిపోవడం లేదా? అని ప్రశ్నించారు. ఈ రోజు అందరూ 'జెన్-జీ' గురించి మాట్లాడుతున్నారని, అయితే, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన 1200 మంది యువతకు ఏం దక్కిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా కాలేజీల్లో, పాఠశాలల్లో చదువుకునే పిల్లలని, యువతను బలి చేసి నాయకులు గద్దెనెక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జెన్-జీ కంటే ముందుతరం తెలంగాణ ఉద్యమ యువత ఉద్వేగంతో వేర్పాటువాద భావజాలాలవైపు వెళ్లి ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ బలిదానాలు తనను కదిలించాయన్నారు. 1200 మందికి నివాళులర్పిద్దామని తాను వెళితే తెలంగాణ ప్రభుత్వం అనుమతివ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను గౌరవించడం లేదని, జనసేనకార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం ద్వారా రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఢిల్లీలోని అశోకా హోటల్‌లో నిర్వహించిన 'జాతీయ సమైక్యత కోసం.. సేన ప్రస్థానం' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం ప్రారంభంలోను.. ముగింపులోను పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

# పుట్టినరోజు కానుక..

మొదటి పేజీ తరువాయి

లబ్ధిదారులందరికీ ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో జూన్ 22న ఆయన ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. పౌర సరఫరాల శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, మొదటి విడత పంపిణీ కోసం సుమారు 46 వేల నూతన రేషన్ కార్డులను ఇప్పటికే సిద్ధం చేశారు.

# దోసె.. మిల్లెట్ ఇడ్లీ..

మొదటి పేజీ తరువాయి

అందిస్తూ మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండి చదువుకునేలా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన 'విద్యార్థులకు అల్పాహారం, పాలు' పథకాన్ని సోమవారం పాఠశాలల ప్రారంభం సందర్భంగా రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పొన్నం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్వినీరెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, డీఈవో యాదయ్య, మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 29 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలకు రాగానే అల్పాహారం, పాలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, డ్రాపవుట్లను తగ్గించేందుకు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ పథకానికి రూ.800 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను సైతం ప్రారంభిస్తున్నామని చెప్పారు. కాగా, హైదరాబాద్‌లో తొలివిడతగా 45 పాఠశాలల్లో అల్పాహారాన్ని అందజేస్తున్నట్లు, దీని ద్వారా 12,437 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. మన్నా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు.

అల్పాహార మెనూ ఇలా ...

సోమవారం: దోసె-చట్నీ.. చపాతీ-కూరగాయలు, పాలు

మంగళవారం: మిల్లెట్ ఇడ్లీ(2)- సాంబార్, రాగి జావ

బుధవారం: పూరీ (2)-ఆలూ కుర్మా, పాలు

గురువారం: మిల్లెట్ ఇడ్లీ (2)- సాంబార్, రాగి జావ

శుక్రవారం: మిల్లెట్ ఉప్మా-పొంగల్- చట్నీ, పాలు

శనివారం: బోండా (2)- చట్నీ, రాగి జావ

# బీజేపీ చేతిలో తోలుబొమ్మ పవన్ కళ్యాణ్

మొదటి పేజీ తరువాయి

అన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతలూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని కించపరుస్తూ మాట్లాడారని అన్నారు. 'తెలంగాణ కోసం ఎంతో మంది అమరులైనారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారు. తెలంగాణ ప్రజలు చూడనిదే పవన్ కళ్యాణ్ సినిమాలు ఆడాయా? ఆయన అంత పెద్ద హీరో అయ్యాడా? ఏపీ డిప్యూటీ సీఎంగా ఆ రాష్ట్రంలో ఆయన చేయాల్సింది చాలా ఉంది. తెలంగాణ గురించి రెచ్చగొట్టే మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదు' అని హెచ్చరించారు. బీజేపీ నాయకత్వం చెప్పిందే పలుకుతున్న పవన్ కళ్యాణ్.. కాంగ్రెస్ పార్టీ, దేశం కోసం గాంధీ, నెహ్రూ కుటుంబాలు చేసిన త్యాగాల చరిత్రను చదువుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతుంటే కేసీఆర్, కేటీఆర్‌లు ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. దీన్ని బట్టి వారి మధ్య ఒప్పందం ఉందని అర్థమవుతోందన్నారు. కాగా, లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పిస్తూ ఇందిరా గాంధీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని 50 ఏళ్ల అయిన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ చేపడుతున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మహ్హ?షకుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# టెక్నాలజీ, ఎయిర్ కనెక్టివిటీ..

మొదటి పేజీ తరువాయి

తీరప్రాంతం, పోర్టుల ద్వారా సరకు రవాణాకు ఉన్న అనుకూలతలను ప్రస్తావించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ తయారీలో ఏపీ దేశంలోనే కీలక పాత్ర పోషించనుందని స్పష్టం చేశారు. విశాఖలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ ఏర్పాటు, ప్రపంచంతో ఏపీని అనుసంధానించే సబ్-సీ కేబుల్ ప్రాజెక్టుల గురించి తెలిపారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా తీర్చిదిద్దుతున్నామని, ఉత్తరాంధ్రలో ప్రపంచ దిగ్గజ ఉక్కు సంస్థ ఆర్సెలార్ మిట్టల్ భారీ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశానికి ముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తో ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారానికి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతి సహా రాష్ట్రంలోని ఇతర నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్‌లో సింగపూర్ నైపుణ్యాన్ని, సహకారాన్ని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. టెక్నాలజీ, సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన రంగాలతో పాటు యూనివర్సిటీల్లో పరిశోధనలకు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా సెమీ కండక్టర్ల తయారీకి అవసరమైన ఎకోసిస్టమ్, కెపాసిటీ బిల్డింగ్‌లో సహకరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా పండిస్తున్న పంటల గురించి సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో పండిస్తున్న ఉద్యాన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అంశాన్ని పరిశీలించాలని కోరారు. ఈ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి ద్వారా రెండు ప్రాంతాలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ చర్చల సందర్భంగా సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, అమరావతి రాజధాని నిర్మాణం గురించి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. రాజధానిలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, మౌలిక సదుపాయాల గురించి ఆసక్తి కనబరిచారు. దీనికి చంద్రబాబు బదులిస్తూ, ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలవనుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో సీఎం వెంట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ, సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ అంబులే తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో రుణంఆపేసిన కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

దశ విస్తరణకు ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశాం. రెండో దశ విస్తరణ చేపట్టడానికి ఫేజ్-1 చేపట్టిన ఎల్ అండ్ టీనే ఒప్పించి ఒప్పందం చేసుకోవాలని కేంద్రం సూచించింది. ఇందుకు ఎల్అండ్‌టీ అంగీకరించలేదు. ఏటా రూ.350-400 కోట్ల నష్టాలొస్తున్నాయని, రెండో దశ విస్తరణ చేపట్టలేమని తేల్చిచెప్పింది. దాంతో.. మొదటి దశ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రెండో దశ విస్తరణ చేపట్టాలని మళ్లీ కేంద్రం సూచించింది. ఈ నేపథ్యంలోనే ప్రజా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని, కాలుష్యాన్ని నియంత్రించాలన్న లక్ష్యాలతో మొదటి విడత మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.30 వేల కోట్ల విలువ కలిగిన మెట్రో మొదటి దశను కేవలం రూ.15 వేల కోట్లకే స్వాధీనం చేసుకుంటున్నాం. ఇందుకు కార్యాచరణ పూర్తి చేశాం. ఎల్అండ్‌టీ రూ.13,600 కోట్లను 8.25 శాతం వడ్డీకి బ్యాంకుల్లో రుణం తెచ్చుకుంది. దానిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశాం. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా తక్కువ వడ్డీకి రుణం తీసుకోవడానికి చర్చలు జరిపాం. రుణానికి ఒప్పించాం. ఐఆర్ఎఫ్‌సీతో అన్ని రకాల ఒప్పందాలు పూర్తయ్యాయి. కేవలం 4 శాతం వడ్డీకి జపాన్ సంస్థ నుంచి అప్పు తీసుకొచ్చాం. ఇది ఐఆర్ఎఫ్‌సీ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్బీఐ కౌంటర్ గ్యారెంటీ కూడా ఇచ్చాం. ఫీజు రూపేణా ఐఆర్ఎఫ్‌సీకి రూ.84 కోట్లతోపాటు ఈక్విటీగా ఎల్అండ్‌టీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1400 కోట్లనూ చెల్లించాం. ఈ క్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లను అనేకమార్లు కలిశాను. మెట్రో విస్తరణ, జపాన్ రుణంపై వారు సానుకూలంగా ఉన్నారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఈరోజు (జూన్-15) నిధులు విడుదల కావాలి. ఇక రుణం వచ్చినట్లేనని మేం అనుకుంటే కిషన్ రెడ్డి అడ్డుకున్నారు. మే 20వ తేదీన ఖట్టర్‌ను, 21న అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారు. తెలంగాణ సీఎం అడిగినవన్నీ ఇచ్చేస్తుంటే.. అక్కడ బీజేపీ ఉండాలా వద్దా..? అని ఆయన వారిని ప్రశ్నించారు. అందుకే.. మేం కిషన్ రెడ్డి వెంట పడుతున్నాం. కిషన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నా. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రిగా నిధులను విడుదల చేయిస్తున్నారా!? లేదా?" అని నిలదీశారు. అహ్మదాబాద్, వైజాగ్‌కు కూడా మెట్రో మంజూరు చేశారని, కానీ, తెలంగాణకు ఇవ్వడం లేదని, దీనినిబట్టే వివక్ష ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చునని వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల్లో మెట్రో విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు సమకూర్చుతోందని, తెలంగాణ విషయంలోనే ఇలా ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. తెలంగాణకు నిధులిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అప్పుడు ఇక్కడ బీజేపీ మూసుకోవాల్సి వస్తుందన్న భయంతోనే కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. దీని వెనక కేటీఆర్ ఉన్నారన్నారు. కేటీఆర్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. "తెలంగాణ అభివృద్ధిపై నిజంగా ప్రేమ ఉంటే ఐఆర్ఎఫ్‌సీ నుంచి నిధులు విడుదల చేయిస్తారా..? లేదా రెండో విడత వ్యయంలో కేంద్రం తన వాటా కింద 50 శాతం ఇచ్చేలా ఒప్పిస్తారా..? లేదా కనీసం రెండో విడత అంతా రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించుకుంటే కేంద్ర ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) అయినా ఇస్తుందా..?" అని ప్రశ్నించారు.

# 19 నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

చేపట్టడం అత్యంత కీలకమన్నారు. నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని.. రాబోయే నాలుగు రోజుల్లో తెలంగాణ అంతటా విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఈ నెల 19 నుంచి వారం రోజులపాటు వర్షాలు కొనసాగవచ్చన్న వాతారణ శాఖ అంచనాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 8వ తేదీన దక్షిణ తెలంగాణలో ప్రవేశించి.. జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా... ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు వరకు కొనసాగుతున్నాయన్నారు. 14వ తేదీ నాటికి దక్షిణ తెలంగాణలో అన్ని జిల్లాలను, మధ్య తెలంగాణలోని చాలా జిల్లాలను రుతుపవనాలు తాకాయని వివరించారు. రాష్ట్రంలో జూన్ 1 నుంచి 15 వరకు సాధారణ వర్షపాతం 65 నుంచి 70 మి.మీ కాగా.. ఇప్పటి వరకు నమోదైనది 50 నుంచి 55 మి.మీ మాత్రమే. సాధారణంతో పోలిస్తే 20 శాతం లోటుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలను పరిశీలిస్తూ.. జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, విపత్తుల నిర్వహణ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాల తీవ్రత ఎక్కువ ఉండే ప్రాంతాలను గుర్తించి.. ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కాగా రాబోయే రోజుల్లో ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ విశ్లేషకుల అంచనా. ముఖ్యంగా 18వ తేదీ తర్వాత నైరుతి రుతుపవనాల ప్రభావం పెరిగి, ఈ ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు పడే అవకాశముంది. హైదరాబాద్ విషయానికి వస్తే... వచ్చే మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా, 18వ తేదీ తర్వాత నగరంలో కూడా మంచి వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని నిపుణులు వెల్లడించారు.

# పశ్చిమాసియాలో శాంతికి మార్గం..

మొదటి పేజీరువాయి

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ ప్రాంతంలో వివాదానికి ముగింపు పలికేందుకు ఇరు దేశాల మధ్య అవగాహన కుదరడాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ఒప్పందం అమలుతో పశ్చిమాసియాలో తిరిగి శాంతి, స్థిరత్వం నెలకొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ ఇంధన మార్కెట్లను తీవ్రంగా కుదిపేసి, విస్తృత యుద్ధ భయాలకు కారణమైన ఈ వివాదం ముగింపు దిశగా సాగడం ఒక ముఖ్యమైన పరిణామం. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందం పూర్తయినట్టు ప్రకటన చేశారు. చరిత్రాత్మక దౌత్య విజయంగా అభివర్ణిస్తూ, హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ముగించడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని తెలిపారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! హర్మూజ్ జలసంధిని టోల్ లేకుండా తిరిగి తెరిచేందుకు నేను పూర్తి అధికారం ఇస్తున్నాను. అదే సమయంలో అమెరికా నౌకా దిగ్బంధనాన్ని తక్షణమే తొలగించాలని ఆదేశిస్తున్నాను. ప్రపంచ నౌకలారా, మీ ఇంజిన్లు ప్రారంభించండి" అని ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ ఒప్పందంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అంతరాయానికి, అనేక దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన పశ్చిమాసియా వివాదానికి ముగింపు పలికేందుకు అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన అవగాహనను నేను స్వాగతిస్తున్నాను. ఈ ఒప్పందం అమలుతో ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం పునరుద్ధరించడంతో పాటు నౌకాయాన స్వేచ్ఛ, వాణిజ్యం సజావుగా సాగుతాయని భారత్ ఆశిస్తోంది. మిగిలిన అంశాలపై కూడా చర్చలు జరిగి, సుస్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.

# సీసీటీఎన్ఎస్ 2.0 అమలు కేసుల వివరాలు సకాలంలో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి

**వర్షాకాలం ప్రారంభ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన రక్షణ పరమైన చర్యలు చేపట్టాలి**

**నెలవారీ నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లా పోలీస్ అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ 2.0 పరిధిలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు నిర్దేశిత కాల పరిమితిలో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, ప్రతి పోలీసు అధికారి సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న కేసులను సకాలంలో పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వర్షాకాలం ప్రారంభ నేపద్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా స్కూల్ బస్సుల ఫిట్నెస్ లను నిశితంగా పరిశీలించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకై సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించి తమ నివాస ప్రాంతాల్లో వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చేయాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ బాధితులకు న్యాయం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ,ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారి గురించి నిరంతరం వాహన తనిఖీలు చేపట్టి పట్టుబడిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో, కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామి, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్ జిల్లాలోని సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# సిర్గాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కరువు... వైద్యులు కరువు!




హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, నారాయణ ఖేడ్ :
సిర్గాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ, షుగర్ చెకప్ చేయించుకుందామని వెళ్లిన మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి కి కనిపించని వైద్యులు... రోగుల ఆవేదన చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే సిర్గాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. అయితే నేడు అదే ఆసుపత్రి వైద్యులు లేక, సరైన వైద్యం అందక, రోగులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితికి చేరుకోవడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. ఒక కార్యక్రమానికి వెళ్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవడానికి వెళ్లిన భూపాల్ రెడ్డి అక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్వయంగా గమనించారు. ఆసుపత్రికి వచ్చిన ప్రజలు "డాక్టర్లు లేరు... ఎవరిని అడిగినా సరైన సమాధానం లేదు... చికిత్స కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది" అంటూ తమ ఆవేదనను మాజీ ఎమ్మెల్యే కి వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ..."గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిర్గాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేశాం. కానీ నేడు అదే ఆసుపత్రి వైద్యులు లేక, వైద్యం లేక విలవిలలాడుతోంది. ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలోనే డాక్టర్లు కనిపించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం."
"వైద్య ఆరోగ్య శాఖకు మంత్రి కూడా ఈ జిల్లాకు చెందిన వారే... తాము డాక్టరమని చెప్పుకునే ప్రజాప్రతినిధులు కూడా ఈ నియోజకవర్గాన్ని ప్రాతినిధ్యం వహిస్తున్నా, సిర్గాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న దయనీయ పరిస్థితిని పట్టించుకోకపోవడం బాధాకరం. ప్రజలకు అందాల్సిన వైద్య సేవలు అందకపోతే వారి హామీలు, మాటలు ఏ ప్రయోజనం?" అని ప్రశ్నించారు.ప్రజల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏ ప్రభుత్వానికీ తగదని, వెంటనే పూర్తి స్థాయి వైద్యులను నియమించి, అవసరమైన సిబ్బంది, మందులు, వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే నిర్లక్ష్యాన్ని వెంటనే సరిదిద్దకపోతే ప్రజల తరఫున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి హెచ్చరించారు.

# వైద్య రత్న, డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డికి పదవీ విరమణ ఘన సన్మానం



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో సుదీర్ఘకాలం పాటు విశేష వైద్య సేవలను అందించి, ప్రజల గుండెల్లో అపారమైన అభిమానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ఎం.వి. కోటిరెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమం రాఘవ నిలయం భద్రాచలంలో అత్యంత ఘనంగా జరిగింది. భద్రాచలం రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సన్మాన మహోత్సవంలో పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, మిత్రులు మరియు ఆయన కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ కోటిరెడ్డి సేవలను కొనియాడారు. వైద్య రంగంలో ఆయన అందించిన విశిష్ట సేవలు, ఆయనకున్న నిరాడంబర వ్యక్తిత్వం మరియు రోగుల పట్ల ఆయన చూపిన అంకితభావాన్ని వక్తలు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు రెడ్డి సోదరులు మాట్లాడుతూ... "ఏజెన్సీ ప్రాంతమైన, గిరిజనులు, పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించే ఈ భద్రాచలంలో, నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత ప్రజలకు డాక్టర్ కోటిరెడ్డి గత 12 సంవత్సరాలుగా వేలాది మంది రోగులకు నాణ్యమైన వైద్యం అందించి ప్రజల గుండెల్లో నిలిచారు. ఈ ఘనత ఒక్క డాక్టర్ కోటిరెడ్డికే దక్కుతుంది" అని కొనియాడారు. ఇంతటి మంచి పేరు తెచ్చిన కోటిరెడ్డి తల్లిదండ్రులకు వక్తలు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. అనంతరం డాక్టర్ కోటిరెడ్డి దంపతులను గజమాలతో, శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరూ ఆయన పదవీ విరమణ జీవితం సుఖసంతోషాలతో, ఆనందంగా, ఆరోగ్యంగా సాగాలని ఆ రామచంద్ర మహాప్రభువును ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. ఈ కార్యక్రమం భద్రాచలం రెడ్డి భవన్ కన్వీనర్ మందపాటి సుధాకర్ రెడ్డి, ఈసీ మెంబర్ బోగాల శ్రీనివాస్ రెడ్డి, ఆడిట్ మెంబర్ జి.వి. రమణా రెడ్డి, సభ్యులు క్వెస్ట్ రాజా రెడ్డి మరియు మారం వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది.

# ఆర్య వైశ్య సంఘము అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

**ఆర్య వైశ్య సంఘము, వాసవి చారిటబుల్ ట్రస్ట్, ఆర్య వైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో నిర్వహణ**



హస్మాత్ పేట్, జూన్ 15,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
ఓల్డ్ బోయిన్పల్లిలో సోమాలయ అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం.బోయినపల్లి ఆర్య వైశ్య సంఘము అన్నదాన కమిటీ వాసవి చారిటబుల్ ట్రస్ట్, ఆర్య వైశ్య మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన అన్నప్రసాద కమిటీ ప్రాజెక్ట్ చైర్మన్ ఎలకంటి సత్యమూర్తి అధ్యక్షతన ఓల్డ్ బోయినపల్లి హస్మాత్ పేట్ చౌరస్తా వద్ద అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వాసవి మహాసభ వైస్ ప్రెసిడెంట్ కైలాష్ రాంచంద్ర గుప్తా,ఓల్డ్ బోయినపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్, రంగా రవీందర్, దండుగుల యాదగిరి పాల్గొన్నారు. వారికీ శాలువాలతో సత్కారించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ ఎలకంటి సత్య మూర్తి గుప్తా మరియు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు గందె గౌరీ శంకర్ గుప్తా,వాసవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మరియు చైర్మన్ ఉప్పాల అశోక్ గుప్తా,ఆర్య వైశ్య మహిళ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గందె ఉమాదేవి గుప్తా మరియు ట్రస్ట్ వైస్ చైర్మన్ ఎలకంటి పూర్ణ చందర్ గుప్తా, సంఘము కోశాధికారి బొమ్మ శ్రీనివాస్ గుప్తా,ట్రస్ట్ కోశాధికారి గందె రామకృష్ణ గుప్తా, నాగిశెట్టి గుప్తా, బి.సతీష్ గుప్తా,పి.సతీష్ గుప్తా ఆర్య వైశ్య సంఘము సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాపూజీ నగర్ లో సెల్ టవర్ అనుమతులు రద్దు చేయాలి

**కలెక్టర్ అంకిత్ కి వినతి పత్రం అందజేసిన నివాసులు**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :
బాపూజీ నగర్ నివాస సముదాయల మధ్య నిర్మించ తలపెట్టిన సెల్ టవర్ అనుమతులను రద్దు చేయలని నిర్మాణం నిలుపుదలచేయాలని కోరుతూ బాపూజీ నగర్ పాల్వంచ నివాసులు జిల్లా కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది. బాపూజి నగర్ 2 వ లైన్ లో ఇంటి నెంబర్ 20/6/92 ఇంటి ఓనర్ రాంబాబు హాస్టల్ వార్డెన్ ఇంటి పై జి ప్లస్ టు లో ఎయిర్టెల్ టవర్ నిర్మించాలని నిర్మాణం చేపట్టినారు. చుట్టు పక్కల వాల్లు వెళ్ళి అడిగినప్పుడు హౌస్ ఓనర్ నేను సెల్ టవర్ నిర్మించటం లేదు. సోలార్ పెట్టుకుంటున్నాను అని చెప్పుకుంటు జి౦2 పైన నిర్మాణం పూర్తి చేసినాడు అతని ఇంటి పొడవు 68" ఇంటి వెడల్పు 22" రోడ్డు ప్రక్కన నివాస సముదాయల మధ్య టవర్ నిర్మించటం వలన రేడియేషన్ విడుదలై, వివిద వ్యాధులు కాన్సర్ వచ్చే ప్రమాదం ఉండటం వలన నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని నిర్మాణాన్ని ఆపాలని బాపూజీ నగర్ వాసులు విన్నవించు కుంటు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపూజీ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

# సాకేతపురి దాసాంజనేయ స్వామి ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం, సారపాక సాకేతపురి దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండి స్వామివారికి అభిషేకము, వస్త్రాలంకరణ, అష్టోత్రము, ఆకుపూజ హనుమాన్ చాలీసా వంటి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ సాకేతపురి దాసాంజనేయ స్వామి ఎంతో శక్తివంతుడని, కోరిని కోర్కెలు తీర్చే ఇష్టదైవమని ఆయనకు తమలపాకు దండ, సింధూరం సమర్పించిన ఎలాంటి కష్టాలు దరిచేరవుఅని భక్తుల విశ్వాసం. అలాంటి స్వామి సేవలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి మంగళవారం జరిగే హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పాల్గొనడం జరుగుతుంది. సాకేతపురి దాసాంజనేయ స్వామి ఆలయం అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలుస్తుందని ,ఈ ఆలయ కేంద్రం ద్వారా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళా భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బెజగం వెంకటయ్య రాధమ్మల జ్ఞాపకార్థంగా అన్న ప్రసాద వితరణ



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల కేంద్రంలో సోమవారం అమావాస్య సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. శ్రీ రామకృష్ణ సాయి మందిరం వద్ద బెజుగం వెంకటయ్య రాధమ్మల జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని చేపట్టారు. బెజగం శ్రీనివాసులు రాజేశ్వరి నాగభూషణం లిఖిత రాజేశ్వర్ రాధిక, కుటుంబ సభ్యులు కార్యక్రమాన్ని చేపట్టగా అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇమ్మడి శ్రీనివాసులు మార్త జగదీశ్వర్ , నంగునూరు రాజు ఉప్పల శ్రీనివాసులు, ఇమ్మడి నర్సింలు, గంగిశెట్టి రాజు, సంతోష్, బెజగం సాయి,, బుడమ సత్యనారాయణ, పుల్లూరు శ్రీనివాసులు, బెజగం చంద్రశేఖర్, మొలుగు సోమలింగం, పెంటయ్య, ఉప్పల రమేష్ తదితరులున్నారు.

# అసంపూర్తిగా బీటీ రోడ్డు పనులు

**గ్రామస్తుల ఆవేదన వెంటనే పూర్తిచేయాలని విజ్ఞప్తి**

**కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యానికి బలైన వేపలగడ్డ రోడ్డు**

**ఐటిడిఏ ఏపీవో కి వినతి పత్రం అందజేత**

**మెండి భాస్కర్**

బూర్గంపహాడ్, జూన్ 15,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : బూర్గంపహాడ్ మండలం వేపలగడ్డ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులు మూడేళ్లుగా అసంపూర్తిగా ఉండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్రికుంట ప్రధాన రహదారి నుంచి వేపలగడ్డ కొమ్ముసకిరిపేట వరకు సుమారు 2.5 కిలోమీటర్ల మేర రూ.2 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ, కాంట్రాక్టర్ మిడ్డిమిక్స్ వేసి పనులను మధ్యలోనే నిలిపివేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.రోడ్డు పనులు నిలిచిపోవడంతో వేపలగడ్డ, పరిసర గిరిజన గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారి



ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు గ్రామానికి చేరుకోలేని దుస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. మిడ్డిమిక్స్ మాత్రమే వేసి వదిలేయడంతో ధూళి కాలుష్యం అధికమై ప్రజలు శ్వాస సంబంధిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు మండల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు వాపోయారు. రూ.2 కోట్ల ప్రజాధనం వెచ్చించి ప్రారంభించిన పనులు ఎందుకు నిలిచిపోయాయో సంబంధిత అధికారులు విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ఏపీవో కి వినతి పత్రం అందజేసి డిమాండ్ చేశారు.గిరిజనులు అధికంగా నివసించే ఈ ప్రాంత ప్రజల కష్టాలను గుర్తించి, అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేపలగడ్డ గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

"ప్రజాధనం ఖర్చు చేసి ప్రారంభించిన అభివృద్ధి పనులు మధ్యలో నిలిచిపోవడం బాధాకరం. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి" అని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15 : అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రెండు సర్కిళ్ల పరిధిలోని 9 డివిజన్ల లో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రధానంగా నూతన కాలనీలలో శంకుస్థాపన చేసిన



అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను పరిశీలించాలని సూచించారు.ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున.. పారిశుధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించడంతోపాటు ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బొల్లారం స్టేడియం, పాటి వివేకానంద స్టేడియంల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. రెండు సర్కిళ్ల కు సంబంధించిన 250 కోట్ల నిధులు తిరిగి డివిజన్లలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు కేటాయించాలని ఇప్పటికే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కు విన్నవించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ప్రదీప్ కుమార్, జ్యోతి రెడ్డి, డిఈ వెంకటరమణ, ఏఈ లు ఫైజాన్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పల్స్ వార్త కథనానికి స్పందించిన అధికారులు

**ఓల్డ్ బోయిన్పల్లి, జూన్ 15,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**

గత కొన్ని నెలల నుండి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎం.ఎం.సి ) పరిదిలోని ఓల్డ్ బోయినపల్లి డివిజన్ 262 లో ప్రధాన రహదారుల్లో చెత్త సేకరణ డబ్బాల్లో కంటే బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువ అని ఓల్డ్ బోయిన్పల్లిలో చెత్త సేకరణ అస్తవ్యస్తం, అధికారుల నిర్లక్ష్యం అని హైదరాబాద్ పల్స్ పత్రికలో ప్రచురణకీ, మాజీ కార్పొరేటర్ ప్రత్యేకంగా సమస్య ఉన్న ప్రదేశాన్ని విక్షించి



## ప్రధాన రోడ్డుపై చెత్త సేకరణ డబ్బాల తొలగింపు



హైదరాబాద్ పల్స్

epaper.hyderabadpulsenews.in | Date: 09 Jun, 2026 | Page: 3

ఓల్డ్ బోయినపల్లిలో చెత్త సేకరణ అస్తవ్యస్తం, అధికారుల నిర్లక్ష్యం




రావాలని కోరారు.ఈ సందర్భంగా ప్రజలు, వాహనదారులు హైదరాబాద్ పల్స్ పత్రికకి, మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలా అన్ని ప్రధాన రహదారుల్లో ఇలాంటి చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేసారు.

# రాష్ట్రంలో స్కూల్ బస్సులపై రవాణా శాఖ ఉక్కుపాదం..
# 245 కేసులు నమోదు, 60 బస్సులు సీజ్

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, తెలంగాణ బ్యూరో:

తెలంగాణలో నేటి నుంచి పాఠశాలలు రీ ఓపెన్ అయిన నేపథ్యంలో విద్యార్థులకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా శాఖ రంగంలోకి దిగింది. ఇవాళ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 245 విద్యాసంస్థల వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు మినిమమ్ ఫిట్‌నెస్ లేని 60 స్కూల్ బస్సులను అధికారులు సీజ్ చేశారు.

**అత్యంత పకడ్బందీగా తనిఖీలు..**

బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడం, సామర్థ్యానికి మించి విద్యార్థులను ఎక్కించుకోవడం, భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలే లక్ష్యంగా ఈ తనిఖీలు జరిగాయి. రానున్న రోజుల్లో కూడా స్పెషల్ రెయిడ్స్ మరిన్ని కొనసాగుతాయని రవాణా శాఖ స్పష్టం చేసింది. తనిఖీలో భాగంగా ప్రధానంగా వాహనానికి చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ ఉన్నాయా లేదా చూస్తున్నారు. సామర్థ్యానికి మించి బస్సుల్లో విద్యార్థులను కుక్కడం, డ్రైవర్లకు వాలిడ్ లైసెన్స్‌తో పాటు తగినంత అనుభవం ఉందా లేదా, బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ ఎమర్జెన్సీ ఎగ్జిట్ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలపై ఫోకస్ పెట్టారు. విద్యార్థులు బస్సులు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు బస్సులో అటెండర్‌ను నియమించారా అని అడిగి తెలుసుకుంటున్నారు.

**యాజమాన్యాలదే పూర్తి బాధ్యత..**

విద్యాసంస్థల విద్యార్థులను రవాణా చేసే వాహనాల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు, నిబంధనల పాటింపులో అలసత్వం వహిస్తే.. అందుకు పూర్తి బాధ్యత సంబంధిత పాఠశాల, కళాశాల యాజమాన్యాలదేనని రవాణా శాఖ తేల్చి చెప్పింది. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు, డ్రైవర్లు, యాజమాన్యాల పై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రవాణా శాఖ గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులుండగా, ఇప్పటి వరకు




23,204 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాయి. మిగిలిన 2,783 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరై సర్టిఫికెట్ తీసుకోవాలని రవాణా శాఖ సూచించింది. అదేవిధంగా తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పంపే వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్లను ముందుగానే సరిచూసుకోవాలని రవాణా శాఖ కోరింది.

# ఓల్డ్ బోయినపల్లి డివిజన్ లో రాంకీ సంస్థ అధికారుల పర్యటన

**చెత్త సేకరణ కేంద్రాల పరిశీలన, సిబ్బందికి పలు సూచనలు**

ఓల్డ్ బోయినపల్లి, జూన్ 15,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :

సోమవారం రోజున ఓల్డ్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్లో చెత్త సేకరణ సంస్థ రాంకీ కంపెనీ అధికారులు పర్యటన చేశారు సమస్యత్మాక ప్రాంతాలను గుర్తించి చెత్త సేకరణ అంశంలో తలెత్తుతున్న




ఇబ్బందులను పరిగణలకు తీసుకొని దీర్ఘకాలికంగా పరిష్కరించేలా చూడాలని డివిజన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో రాంకీ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్య ఆపరేషనల్ అధికారి వేణు, జోనల్ హెడ్ ఆకాష్,ఫ్లీట్ ఆమానుల్లా ఖాన్, సర్కిల్ ఇంచార్జ్ అరుణ, బోయినపల్లి సర్కిల్ – –03 జవాన్ మరియు ఎస్. ఎఫ్.ఏ టీం సభ్యులు పాల్గొన్నారు.

# అల్వాల్ లో సోమలాయ అమావాస్య అన్నదాన కార్యక్రమం

**అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో**



అల్వాల్, జూన్ 15,మేడ్చల్:

సోమాలయ అమావాస్య సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని అల్వాల్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు శ్రీరాములు గుప్తా జ్ఞాపకార్థం అన్న ప్రసాద దాత నీల సంతోష్ గుప్తా సహకారంతో ప్రతి అమావాస్య రోజున నిర్వహించే ఈ సేవా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు,నిరుపేదలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సమాజ సేవే పరమ ధర్మమనే లక్ష్యంతో సంఘం సభ్యులు స్వయంగా భోజనం వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతానికి సహకరించిన దాతలు, సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు నగేష్,మంచాల రవీందర్, అయిత సత్యం,అమర బాలేష్, గుండా జగదీష్,తడక వెంకటేష్, గుండవల్లి శ్రీనివాస్, తుడుపు నూరి బాలేష్, నీతి రమేష్, పిన్నింటి లక్ష్మీనారాయణ, మంచికొండ నాగేందర్, శంకర్ అంజయ్య,వచ్చి ప్రసాద్, నాగేశ్వర్,ఉప్పల లక్ష్మణ్, చిరుత సత్యనారాయణ, రెడ్డిపల్లి వెంకటేష్, రాజేందర్, మంచాల ప్రభాకర్, కాముని సంతోష్, దాముకొండ శ్రీనివాస్, దాముకొండ రామచందర్, బెల్లి మంచు కోటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ రాష్ట్ర ప్రగతికి విశేష కృషి చేస్తున్న నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు.భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఇరువురు నాయకులు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై స్నేహపూర్వకంగా చర్చించారు.

# 50 రోజులుగా లీకవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



హైదరాబాద్ పల్స్, జూన్ 15, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలోని జోగ్యతండా గ్రామపంచాయతీ పరిధిలో ఖమ్మం – మహబూబాబాద్ ప్రధాన రహదారి వెంట ఉన్న మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ దెబ్బతిని దాదాపు 50 రోజులుగా లీకేజీ సమస్య కొనసాగుతోంది. దీంతో తాగునీరు భారీగా వృథా కావడంతో పాటు ప్రజలు తీవ్ర అసౌకర్యాలను ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలు పలుమార్లు మిషన్ భగీరథ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో తాజాగా మరోసారి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి సోమవారం మరమ్మతు పనులను ప్రారంభించారు. మిషన్ భగీరథ శాఖ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో సిబ్బంది, జేసీబీ సహాయంతో పైప్‌లైన్ తవ్వకాలు చేపట్టి దెబ్బతిన్న భాగాన్ని గుర్తించి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పనులను గ్రామపంచాయతీ ప్రతినిధులు, వాటర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పర్యవేక్షించారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కార చర్యలు ప్రారంభం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేసి తాగునీటి సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

# బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, ,జహీరాబాద్: జహీరాబాద్–బీదర్ ప్రధాన రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన లారీ, బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడి, సంఘటనా స్థలంలోనే దుర్మరణం పాలయ్యారు. కాగా సంఘటన, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతల కారణంగా జహీరాబాద్ – బీదర్ రోడ్డుపై ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వచ్చిన లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్ట్‌మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు? ఎక్కడి నుంచి వస్తున్నాడు? అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు...



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసిన, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలి గేట్ తంగాళ్ళపల్లి రవికుమార్ తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఉప ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి.. భూతల్లిని ఆరాధించండి..!

**దత్తగిరి పీఠాధిపతి అవధూతగిరి పిలుపు**

**ముగిసిన 16 సోమవారాల వ్రతం**

**వైభవంగా రుద్రయజ్ఞం, పూర్ణాహుతి**





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, ఝరాసంగం :
"భూమాత మనందరికీ తల్లి. ఆమె ఒడిలోనే జన్మిస్తాం, ఆమె సంపదతోనే జీవిస్తాం, చివరకు ఆమె ఒడిలోనే విశ్రాంతి పొందుతాం. భూమిని ప్రేమించడం, పరిరక్షించడం ప్రతి మనిషి ధర్మం. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి భూతల్లికి సేవ చేయాలి" అని సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ పిలుపునిచ్చారు. సోమవారం షోడశ (16) సోమవారాల వ్రతం ముగింపు సందర్భంగా ఆశ్రమ మాతృమూర్తులు ఆనందగిరి, నందినిగిరి చేపట్టిన వ్రతానికి సమాప్తి నిర్వహించారు. ఈ సందర్భంగా 16 పార్థివ లింగాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతి, గౌరీ పూజ, అగ్నిగుండ ప్రవేశం, రుద్రసహిత నారాయణ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తగిరి ఆశ్రమ వేదమంత్రాలతో ప్రతిధ్వనించింది. అనంతరం మహిళా మూర్తులకు వాయినాలు ఇచ్చారు. పరిసరాలు జహీరాబాద్, సంగారెడ్డి, నారాయణఖేడ్, బీదర్, మొగుడంపల్లి, కోహీర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన నిర్వహించారు.


## ప్రజల సమస్యల పరిష్కారానికి

# వేదికగా ప్రజావాణి కార్యక్రమం : జిల్లా ఎస్పీ

**ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ.**


**ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి సత్వర న్యాయం అందించాలని అధికారులకు ఆదేశాలు.**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, సంగారెడ్డి ప్రతినిధి:
ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్., ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత అంశాలపై స్థానిక ఎస్.హెచ్.ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకొని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో తమ సమస్యలు పరిష్కారం దొరకనప్పుడు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# కాక్రోచ్ జనతా పార్టీపై పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15 :
ఢిల్లీలో జనసేన పార్టీ నిర్వహించిన జాతీయ సమైక్యత సమావేశంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దేశ సమగ్రతను బలోపేతం చేసే దిశగా ముఖ్యమైన సందేశం ఇచ్చారు. ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అయిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమంపైన ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.

ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదన్న పవన్ కళ్యాణ్

చిన్న చలిచీమలు కూడా బలమైన సర్పాన్ని చంపేస్తాయని సుమతీ శతకం నుంచి ఉదాహరణతో, విభజనవాద శక్తులు దేశ సమగ్రతను బలిచేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "చిన్న మనుషులు అని తక్కువ అంచనా వేయకూడదు. వారి ఆలోచనలు దేశానికి మంచి చేస్తాయా లేదా చెడు చేస్తాయా అనేది గమనించాలి.

దేశ శ్రేయస్సు, ఐక్యత లక్ష్యంగా జనసేన

కాక్రోచ్ జనతా పార్టీ వంటి ఉద్యమాలు అవినీతి, నిరుద్యోగం వంటి సమస్యలను ఎత్తి చూపుతున్నా, వాటిని విభజనవాద దిశగా మళ్లించకుండా జాగ్రత్తగా ఉండాలి" అని జనసైనికులకు స్పష్టమైన సూచనలు చేశారు. జనసేన ఎప్పటికప్పుడు దేశ శ్రేయస్సు, ఐక్యతను ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్ జనసేన 12 ఏళ్ల ప్రయాణాన్ని సమీక్షించారు.

లక్ష సభ్యులతో మొదలై 20 లక్షలకు పైగా సభ్యత్వంతో జనసేన

లక్ష సభ్యులతో ప్రారంభమైన పార్టీ నేడు 20 లక్షలకు పైగా సభ్యత్వం సాధించిందని, 21 ఎమ్మెల్యేలు, 3 ఎంపీలతో బలం పెంచుకుందని తెలిపారు. అధికారం కోసం కాకుండా దేశ సమగ్రత, ప్రాంతీయ ఆకాంక్షలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని పార్టీ నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. తెలంగాణ విషయంలో కూడా స్పష్టత ఇస్తూ, రాష్ట్ర విభజన సమయంలో ఏర్పడిన అశాంతి ఇప్పటికీ కొనసాగుతోందని, జనసేన ఎప్పుడూ విభజనను ప్రోత్సహించలేదని వివరించారు.

## బోయినపల్లి ప్రాంత భూ వివాదంపై

# హైదరాబాద్ కలెక్టర్ కి వినతి పత్రం

**కలెక్టర్ ని కలిసిన బి.ఆర్.ఎస్.పార్టీ నేత మన్నే క్రీశాంక్**





లకడికపూల్, జూన్ 15,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధి బోయిన్పల్లి ప్రాంతంలోని సర్వే నంబర్ 157/1కు సంబంధించిన సుమారు 8 ఎకరాల ప్రభుత్వ భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆలాని కోరారు.ఈ మేరకు కంటోన్మెంట్ టిఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నెకిశాంక్ భూవివాదంపై హైదరాబాద్ కలెక్టర్ సుమారు రూ.800 కోట్లకు పైగా విలువ చేసే ఈ భూమిని గతంలో ప్రభుత్వ భూమిగా గుర్తించి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియో గించాలని భావించినట్లు తెలిపారు. ముఖ్యంగా 2025లో ఈ స్థలంలో సుమారు 6,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే ప్రతిపాదనలు వచ్చినట్లు, దీనికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రభుత్వానికి వినతులు సమర్పించినట్లు లేఖలో ప్రస్తావిం చారు.అయితే కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే ఆ భూమి ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల ఆధీనంలోకి వెళ్లిందనే అనుమా నాలు వ్యక్తమవుతున్నాయని బీఆర్ఎస్ పేర్కొంది. ప్రస్తుతం భూమికి నీలి రంగు షీట్స్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఈ భూమికి సంబంధించిన గత వివాదాలు, సర్వే భేదాభిప్రా యాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, యాజమాన్య అంశాలపై పూర్తి వివరాలు వెలుగులోకి తేవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అలాగే ఈ వ్యవహారంలో స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఎందుకు స్పందించడం లేదని, ప్రభుత్వం స్పందించడం లేదని ప్రశ్నించింది. ఈ మూడు పేజీల లేఖలో ఎమ్మెల్యేపై రూ.5 కోట్ల లంచం తీసు కున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని ప్రస్తావించారు.ఈ మేరకు బీఆర్ఎస్ పలు డిమాండ్ లు ముందుంచింది. 8 ఎకరాల భూమి యాజమాన్యం, హోదాపై స్వతంత్ర విచారణ నిర్వహించాలి. భూమి ఇప్పటికీ ప్రభుత్వ ఆస్తిగానే ఉందా లేదా యాజమాన్యంలో మార్పు జరిగిందా అన్నది నిర్ధారించాలి. భూమికి సంబంధించిన నిర్ణయాల్లో పాల్గొన్న అధికారులు,ప్రజా ప్రతినిధుల పాత్రను పరిశీలించాలి. అధికారులు, ప్రజా ప్రతినిధుల అధికారదుర్విని యోగా నికి పాల్పడ్డారా, లేదా ఆర్థిక అక్ర మాలు జరిగాయా అనే అంశం పైదర్యాప్తు చేపట్టాలి.భూమికి సంబంధించిన సర్వే రికార్డులు, అనుమతులు, ప్రభుత్వ ఉత్తర్వు లను ప్రజలకు అందు బాటులో ఉంచాలి. విచారణ పూర్తయ్యే వరకు భూమిని ఆక్రమణలు, అనధికార కార్యకలాపాల నుంచి రక్షించాలి. 6,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనపై ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని కలెక్టర్ ని కోరారు.ఈ సమావేశంలో బి.ఆర్.ఎస్.పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### బిస్కెట్ ఆశ చూపి మూడేళ్ల బాలికపై

# అత్యాచారం.. రాజుకున్న రాజకీయ రచ్చ!

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15 :
తమిళనాడు రాష్ట్రంలోని తిరువళ్లూరు జిల్లా అత్యంత అమానుష ఘటన వెలుగుచూసింది. ఆదివారం కనిపించకుండా పోయిన ఓ మూడేళ్ల చిన్నారి పొదల్లో తీవ్ర గాయాలతో కనిపించింది. ఆ చిన్నారిపై లైంగిక దాడి జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ పసికందు ప్రాణాలు విడిచింది. ఈ దారుణానికి సంబంధించి పోలీసులు బీహార్ కు చెందిన 19 ఏళ్ల వలస కార్మికుడిని అరెస్ట్ చేశారు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

బిస్కెట్లు ఇస్తానని నమ్మించి..

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆ చిన్నారి తన ఇంటి సమీపంలో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. నిందితుడు ఆ చిన్నారికి బిస్కెట్ ప్యాకెట్ ఇస్తానని ఆశ చూపి లోబరుచుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. సాయంత్రం 6 గంటలైనా పాప ఇంటికి రాకపోవడంతో తల్లి వెతకడం ప్రారంభించింది. ఆ చిన్నారి పొదల్లో తీవ్ర రక్తస్రావంతో, అత్యంత విషమ పరిస్థితిలో కనిపించింది. వెంటనే ఆ చిన్నారిని ఆస్పత్రికి తరలించినప్పటికీ.. అప్పటికే పరిస్థితి చేయి దాటిపోవడంతో పాప ప్రాణాలు కోల్పోయింది. బీహార్



నుంచి వచ్చిన వలస కార్మికుడిని పట్టుకుని స్థానికులు పోలీసులకు అప్పగించారు. మరికొందరిపైనా అనుమానంతో స్థానికులు దాడి చేశారు. ఈ క్రమంలో ఆ చిన్నారిపై సామూహిక అత్యాచారం జరగలేదని.. ఒకరి ప్రమేయం మాత్రమే ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రస్తుతం నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ముదిరిన రాజకీయ రగడ

ఈ ఘోరం తమిళనాడులో తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఈ ఘటనపై డీఎంకే ఎంపీ కనిమొళి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మూడేళ్ల చిన్నారిని పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడటం తనను తీవ్రం కలచివేసిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మహిళలు తమ పిల్లల రక్షణ విషయంలో జాగ్రత్తలు వహించాలని కోరుతూనే.. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

టీవీకే ప్రభుత్వంపై ఉదయనిధి స్టాలిన్ ఫైర్

డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ఈ ఘటనపై అధికార టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుపడ్డారు. సీఎం విజయ్ నేతృత్వంలోని సర్కారులో మహిళలు, పిల్లలపై నేరాలు నిత్యకృత్యంగా మారిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మరణశయ్యపై ఉన్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి వెంటనే ఉన్నతస్థాయి పోలీస్ అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి నేరాల నియంత్రణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం విజయ్ బాధ్యతలు చేపట్టాక మహిళల రక్షణ కోసం 'సింగప్పెణ్' అనే ప్రత్యేక విభాగాన్ని ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ దారుణం జరగడం గమనార్హం.

# ఫీజుల దోపిడీకి చెక్?..

## ప్రైవేట్ బడుల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం సిద్ధం.!

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశాలు, నిబంధనలు కఠినంగా ఉండాలని సూచన.**

**మొత్తం స్కూళ్లను కేటగిరీలుగా విభజించే యోచన, ఆ ప్రకారమే నిర్దిష్ట ఫీజుల ఖరారు.**

**ఈ నెలలోనే రూల్స్ తెచ్చేందుకు సర్కారు కసరత్తు.**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, తెలంగాణ బ్యూరో:
ప్రైవేటు విద్యాసంస్థల ఇష్టారాజ్యానికి, ఫీజుల పేరిట సాగుతున్న నిలువుదోపిడీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో.. ప్రైవేటు యాజమాన్యాలు విడతలవారీగా (ఇన్‌స్టాల్‌మెంట్స్) ఫీజులు వసూలు చేసేలోపే కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చి.. వారిని కట్టడి చేయాలని భావిస్తోంది. విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు రెడీ చేయాలని ఉన్నతాధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించినట్టు తెలుస్తోంది. రూల్స్ విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఏటా అడ్మిషన్ల పేరిట మధ్యతరగతి, పేద తల్లిదండ్రుల రక్తాన్ని పిండి రూ. వేల కోట్లు కొల్లగొడుతున్న ప్రైవేటు స్కూళ్లు, ఇంటర్ కాలేజీల అక్రమ వసూళ్లకు తక్షణమే అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా చట్టపరమైన చర్యలకు పూనుకోవాలన్నారు. అత్యధికంగా పొలిటికల్‌గా యాక్టివ్గా ఉన్నవాళ్లే విద్యాసంస్థలు నడుపుతున్నందున.. ఎక్కడా రాజీపడకుండా కఠినంగా వ్యవహరించేలా ఫీజుల కట్టడి మార్గదర్శకాల వ్యవస్థ ఉండాలని సూచించారు.




ఇతర రాష్ట్రాల విధానాలపై స్టడీ.. రిపోర్టులు సిద్ధం:

రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణపై ఇప్పటికే తిరుపతి రావు కమిటీ, తెలంగాణ విద్యా కమిషన్‌తోపాటు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు నివేదికలు సమర్పించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలపైనా అధికారులు సుదీర్ఘంగా అధ్యయనం చేశారు. ముఖ్యంగా తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ, యూపీ రాష్ట్రాల్లో ఫీజుల కట్టడికి అనుసరిస్తున్న చట్టాలు, అక్కడి కోర్టుల తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేశారు. ఈ నివేదికల ఆధారంగానే ప్రతిపాదనలకు తుదిరూపు ఇవ్వాలని సీఎస్, సీఎంవో అధికారులకు సీఎం ఆదేశించినట్టు తెలిసింది.

3 కేటగిరీలుగా స్కూళ్ల విభజన:

ఫీజుల నిర్ణయం అందరికీ ఒకేలా కాకుండా, విద్యాసంస్థల్లో ఉన్న వసతులు, మౌలిక సదుపాయాల ఆధారంగా శాస్త్రీయంగా వర్గీకరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం ప్రైవేటు స్కూళ్లను 3 కేటగిరీలుగా విభజించనున్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలం, భవన వసతులు, ఉపాధ్యాయుల జీతభత్యాల ఆధారంగా ఏ కేటగిరీ స్కూల్‌కు ఎంత ఫీజు ఉండాలనే గరిష్ట పరిమితిని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. దీనివల్ల సాధారణ వసతులు ఉంటూ.. డిజిటల్, గ్లోబల్, ఇంటర్నేషనల్ అనే బోర్డులు తగిలించి వేలాది రూపాయలు గుంజే స్కూళ్లకు బ్రేక్ పడనుంది. పకడ్బందీగా అమలుచేసేందుకు ప్రతి స్కూల్‌లో ఫీజు డిస్ ప్లే చేయడంతోపాటు.. పేమెంట్ రిసిప్ట్, ప్రభుత్వం తరఫున కంప్లైంట్ బాక్స్ , ఫీజుల చెల్లింపులో యజమాన్యాలతో తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేయడంలాంటివి పరిశీలిస్తున్నారు.

విడతల వసూళ్లకు ముందే 'బ్రేక్':

ప్రస్తుతం అకడమిక్ ఇయర్ (విద్యాసంవత్సరం) ప్రారంభం కావడంతో ఇప్పటికే ప్రైవేట్ యాజమాన్యాలు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేశాయి. అయితే, చాలావరకు విద్యాసంస్థలు ఫీజులను మూడు లేదా నాలుగు ఇన్‌స్టాల్‌మెంట్లలో వసూలు చేస్తుంటాయి. మొదటి విడత అడ్మిషన్ల సమయంలో తీసుకున్నా.. మిగిలిన విడతల ఫీజులు వసూలు చేసే లోపే కొత్త రూల్స్‌ను తీసుకువచ్చి కట్టడి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల (జూన్) లోనే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కసరత్తు చేస్తున్నది. ప్రభుత్వ నిర్ణయం అమల్లోకి వస్తే అదనపు ఫీజుల బాదుడు నుంచి తల్లిదండ్రులకు పెద్ద ఉపశమనం లభించనున్నది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:

చదువు అనేది వ్యాపారంగా మారి, సామాన్యుడికి భారం కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని, నిబంధనలు ఉల్లంఘించే యాజమాన్యాలపై కఠిన చర్యలు ఉంటాయని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. కేవలం స్కూళ్లే కాకుండా, ఇంటర్మీడియెట్ కాలేజీల ఫీజులపై కూడా తక్షణ నిర్ణయం తీసుకోనున్నారు. మెటీరియల్స్, ఏసీ, స్పెషల్ కోచింగ్‌ల పేరిట దోపిడీ చేస్తే గుర్తింపు రద్దు చేసేలా రూల్స్ రెడీ చేస్తున్నారు. ప్రైవేటు స్కూళ్ల పరిస్థితి, ఇష్టారాజ్యంగా వసూళ్లపై ఎవరైనా సరే..పలుకుబడిలాంటివి ఏమీ చూడకుండా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నది.

# నిరుపేద విద్యార్థులను ఆర్మీ సైనికులుగా మార్చిన ఎస్.వై.ఎం.ఎస్

**వాట్సాప్ మాధ్యమం ద్వారా 62 మందికి పైగా అగ్నివీర్ కు ఎంపిక....**

**అభినందన సభలో బండారి ప్రసాద్ ముదిరాజ్ వెల్లడి....**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :
నిరుపేద కుటుంబలలో నుండి ఆర్మీలో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కష్టపడి చదివే వారికి వాట్సాప్ మాధ్యమం ద్వారా ఉచితంగా పీడీఎఫ్, మునుపటి పేపర్లను పంపిస్తూ ఆన్లైన్ ద్వారా వ్యాయామ శిక్షణ, మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తూ మే 2026 లో వెలువడిన ఫలితాలలో ఏకంగా 62 పైచిలుకు ఉద్యోగాలను (ఎస్.వై.ఎం.ఎస్) సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ విద్యార్థులు సాధించారన్నారు ఫౌండర్ ఌ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బండారి ప్రసాద్ ముదిరాజ్ ఈ సందర్భంగా ఆర్మీ సైనికులుగా ఉద్యోగం




సాధించిన అభ్యర్థులకు సోమవారం రోజు ఆలేరులో అభినందన సభను నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. వేయిలలో ఫీజులు వసూలు చేసి ఉద్యోగాలు వచ్చిన రాకున్నా ఎన్నో ప్రలోభాలకు గురిచేసే ప్రైవేటు అకాడమీలకు ధీటుగా కేవలం వాట్సాప్ మాధ్యమం ద్వారా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఎస్.వై.ఎం.ఎస్ ఇచ్చిన కోచింగ్ వల్ల 62 మందికి పైగా ఉద్యోగాలను సాధించారు అసాధ్యమైన పనిని వాట్సాప్ మాధ్యమం ద్వారా సుసాధ్యం చేసారు కావున ఇలాంటి నిరుపేదలను దేశ రక్షకులుగా మారుస్తున్న ఎస్.వై.ఎం.ఎస్ కు రాష్ట్ర ప్రభుత్వం సహకరించి ఉచిత ట్రైనింగ్ సెంటర్స్ ను ఏర్పాటు చేసి వారి సేవలను గుర్తించాలని అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, ప్రముఖులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో సైనిక యూత్ మోటివేషనల్ సొసైటీ ఫౌండర్ ఌ చైర్మన్ డాక్టర్ అరిగే లోకేష్ ముదిరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, మహేష్, రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మహేష్, జ్యోతి, పల్లవి, తల్లిదండ్రులు, ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల జీతాల చెల్లింపుపై వినతిపత్రం


**అల్వాల్ సర్కిల్ కార్యాలయం ముందు బీజేపీ నేతల నిరసన**





అల్వాల్, జూన్ 15, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :
విద్యుత్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరుతూ అల్వాల్ డివిజన్ బీజేపీ నేతలు అల్వాల్ సర్కిల్ కార్యాలయం ముందు సోమవారం నిరసన చెపట్టారు. అనంతరం డిప్యూటీ కమీషనర్ బోగేశ్వర్లకు ప్రజా వాణిలో వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ 135 డివిజన్ బీజేపీ నాయకులు కార్తీక్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, అజయ్ రెడ్డి, మొయి సుజాత, పద్మిని, మల్లికార్జున్, ఉదయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని స్వాగతించిన ప్రధాని మోదీ



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, సెంట్రల్ బ్యూరో :
ప్రపంచాన్ని తీవ్ర సంక్షోభం వైపు నడిపించిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరపడింది. ఇరాన్‌తో సుదీర్ఘంగా సాగుతున్న యుద్ధానికి అమెరికా ముగింపు పలికింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు."పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆర్థిక నష్టాన్ని కలిగించాయి. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టానికి కారణమైన ఈ యుద్ధానికి ముగింపు పలికేలా అమెరికా-ఇరాన్ ఓ అంగీకారానికి రావడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. మిగిలిన సమస్యలపై కూడా చర్చలు జరిపి.. ఓ స్థిరమైన తుది ఒప్పందం కుదురుతుందని ఆశిస్తున్నాం" అని ప్రధాని తన ట్వీట్‌లో రాసుకొచ్చారు.

## సచిన్ సావత్ ని ఘనంగా సన్మానించిన భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్....

**బీఎల్ఏలకు ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ....**

**ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అబ్జర్వర్ శిక్షణ....**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ బీఎల్ఏలకు టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ – ఎస్ఐఆర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అబ్జర్వర్ సచిన్ సావత్, డీసీసీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగెళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, పీసీసీ డెలిగేట్ తంగెళ్ళపల్లి రవికుమార్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ అబ్జర్వర్ సచిన్ సావత్ ని భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్మన్ తంగల్పల్లి శ్రీవాణి రవికుమార్ మరియు పీసీసీ డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ ఘనంగా సన్మానించారు.

## జిల్లా డీసీసీ ఆధ్వర్యంలో భువనగిరి నియోజకవర్గ బిఎల్ఏ లకు ప్రత్యేక శిక్షణ....

## పాల్గొన్న బీర్ల ఐలయ్య, కుంభం అనిల్ కుమార్ రెడ్డి,సచిన్ సావంత్...





హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన వివేరా హోటల్లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై భువనగిరి నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ)ల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు నమోదు కావడం, అనర్హుల పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి అంశాలపై బిఎల్ఏ లకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి మరియు తెలంగాణ ఇన్‌చార్జి సచిన్ సావంత్, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బిఎల్ఏ లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేరు లేదా ఇతర వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. పార్టీ శ్రేణులు, బిఎల్ఏ లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటు హక్కు వినియోగంపై ప్రతి కుటుంబానికి సమాచారం చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు జిల్లా, మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, బిఎల్ఏ లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సందేహాలను నాయకులు నివృత్తి చేసి, కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు.

## బూడిద యాదగిరిని పరామర్శించిన మోకుదెబ్బ జిల్లా కమిటీ సభ్యులు....



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి జారిపడి తీవ్రంగా గాయపడిన గీత కార్మికుడిని గౌడ హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ నాయకులు ఆదివారం పరామర్శించారు. రాజపేట మండలం లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు బూడిద యాదగిరి గౌడ్ గత నెల తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కింద పడగా వెన్నుముకకు బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు నాగోల్‌లోని సుప్రజ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందించారు. ప్రస్తుతం పూర్తి బెడ్ రెస్ట్‌లో ఉన్న యాదగిరిని మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గుల్లపెల్లి వెంకటేష్ గౌడ్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితుడి కుటుంబానికి సంఘం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల వీరస్వామి గౌడ్, నాయకులు బూడిద శరత్ గౌడ్, ఇండ్ల బాల సిద్ధులు, ఇంజ కనకరాజు, బూడిద సంపత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
హైదరాబాద్ పల్స్
జాతీయ తెలుగు దినపత్రిక
"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్
- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413
www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad

# భవిష్యత్ లో జిల్లా ఆస్పత్రుల్లో ఎ.ఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలు.. ప్రకటించిన మంత్రి

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, తెలంగాణ బ్యూరో :

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వైద్యుల సామర్థ్యాన్ని మరింత పెంచి, ప్రజల ప్రాణాలను కాపాడే శక్తివంతమైన సాధనంగా మారుతుందని తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఆస్పత్రులలో ఏఐ వినియోగం కోసం తీసుకుంటున్న అనేక కీలక నిర్ణయాలను వెల్లడించారు.

ప్రపంచం వైద్య చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన మార్పు దశలో ఉందన్న మంత్రి

హైదరాబాద్ హైటెక్ సిటీలో అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ఈ విషయాలను వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, ప్రపంచం వైద్య చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన మార్పు దశలో ఉందని పేర్కొన్నారు. గతంలో వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడంపై దృష్టి సారించేవారన్నారు. కానీ ఏఐ దానిని మార్చేసిందన్నారు.

రాబోయే రోజుల్లో జిల్లా ఆస్పత్రుల్లో కూడా ఏఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలు

ఇప్పుడు కృత్రిమ మేధస్సు, జీనోమిక్స్, డిజిటల్ హెల్త్ సాంకేతికతల సాయంతో వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారించి, ప్రతి వ్యక్తికి వ్యక్తిగతంగా అనువైన చికిత్స అందించే యుగం వచ్చిందని వివరించారు. రాబోయే రోజుల్లో జిల్లా ఆస్పత్రుల్లో



కూడా ఏఐ ఆధారిత వ్యాధి నిర్ధారణ వ్యవస్థలను విస్తృతంగా అమలు చేసి, నిపుణుల వైద్య సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో కూడా అత్యున్నత స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రకటించారు.

ఆస్పత్రులలో ఇప్పటికే ఈ సాంకేతికతలు

ఎక్స్‌రే చిత్రాల ఏఐ విశ్లేషణ, సెప్సిస్ ముందస్తు గుర్తింపు, ఫ్యాటీ లివర్ వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించే సాంకేతికతలను ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇప్పటికే ప్రవేశపెడుతున్నామని తెలిపారు. కృత్రిమ మేధస్సు ఎంత అద్భుతమైనదైనా, అది వైద్యులను భర్తీ చేయదని, వారి సామర్థ్యాన్ని మాత్రమే పెంచుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక స్థితి ఏమైనా ప్రతి పౌరుడికి నాణ్యమైన, వేగవంతమైన, సరసమైన వైద్య సేవలు అందాలన్నదే లక్ష్యమని అన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ విద్యా విధానం

హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా, బయోటెక్ రంగాల్లో ప్రపంచ స్థాయి గుర్తింపు పొందినట్టు, ఆరోగ్య రంగంలో ఏ ఐ సొల్యూషన్స్ అభివృద్ధిలో కూడా ప్రపంచ కేంద్రంగా ఎదగాలని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, సిమ్యులేషన్ ల్యాబ్స్, హైబ్రిడ్ బోధన వంటి అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసి భవిష్యత్ వైద్యులను ఏ ఐ యుగానికి సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ప్రతి రోగికి వ్యక్తిగత వైద్య సేవలు అందించే దిశగా తెలంగాణ

విజన్-2047 లక్ష్యాలతో సమన్వయం చేసుకుని చికిత్స ఆధారిత వ్యవస్థ నుంచి నివారణ ఆధారిత ప్రజారోగ్య వ్యవస్థగా మార్చాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏఐ, జీనోమిక్స్, ప్రిసిషన్ మెడిసిన్ ద్వారా ప్రతి రోగికి వ్యక్తిగత వైద్య సేవలు అందించే దిశగా తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో స్టార్టప్‌లు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, మానవీయ విలువలు, వైద్యుల అనుభవం, రోగి సేవాభావం ఎప్పటికీ అనివార్యమని ఆయన అన్నారు.

# ఇందిర బతికుండి ఉంటే బీజేపీని ఎప్పుడో నిషేధించేవారు.. అశోక్ గహ్లోత్ వివాదాస్పద వ్యాఖ్యలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15 :

రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గహ్లోత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం దేశంలో అత్యంత భయంకరమైన పరిస్థితులు ఉన్నాయన్నారు. తన 50 ఏళ్ల ప్రజా జీవితంలో ఇంతటి ప్రమాదకర పరిస్థితులు ఎన్నడూ చూడలేదన్నారు. బీజేపీ అభివృద్ధిని పక్కనపెట్టి హిందుత్వ పేరుతోనే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. నేడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ బతికుండి ఉంటే బీజేపీ లాంటి పార్టీని ఎప్పుడో నిషేధించేవారని సంచలన వ్యాఖ్యలు చేశారు. జైపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో దేశం అత్యంత గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. దేశ ప్రజలు ఇప్పటికైనా



మేల్కొనకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా టికెట్ ఇవ్వకపోవడాన్ని ఈ సందర్భంగా గహ్లోత్ ప్రస్తావించారు. కనీసం కొన్ని స్థానాలైనా కేటాయించి ఉండి ఉంటే దేశానికి వేరే సందేశం వెళ్లేదని అభిప్రాయపడ్డారు. "దేశ ప్రజలకు చూపించడానికైనా కనీసం ఒక ఐదు సీట్లు అయినా ఇచ్చి ఉండాల్సింది. కానీ మాది కేవలం 'ప్యూర్ హిందుత్వ పార్టీ' అని ప్రాజెక్ట్ చేసుకోవడమే వారి ఉద్దేశం. కేవలం హిందుత్వ మద్దతుదారులను రెచ్చగొట్టి పాలించాలనే ఆలోచనలో వారు ఉన్నారు. ఇందిరా గాంధీ లాంటి మహోన్నత నాయకులు ఈరోజు బతికి ఉంటే.. బీజేపీ లాంటి పార్టీపై ఎప్పుడో నిషేధం విధించి ఉండేవారు" అని గహ్లోత్ విమర్శించారు. "హిందుత్వ ఎజెండాతోనే మీరు పార్టీని నడుపుతారా..? కేవలం హిందువుల పేరుతోనే రాజకీయం చేయాలనుకుంటున్నారా..?" అంటూ ప్రశ్నించారు. ఆయన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. అశోక్ గహ్లోత్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్‌కు హిందువులు, హిందుత్వం అంటే ద్వేషమని ఆరోపించింది.

# ఎన్ఐపిఇఆర్ లలో పరిపాలనా పారదర్శకత...

## ఖాళీల భర్తీపై చర్యలు తీసుకోవాలి : ఎంపీ చామల...



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : న్యూఢిల్లీ, జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధన కౌన్సిల్ 3వ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దేశంలోని ఔషధ విద్య, పరిశోధన రంగాల్లో జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో అన్ని జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధనల్లో 5 సంవత్సరాల పదవీకాలంతో రెగ్యులర్ రిజిస్ట్రార్లను నియమించాలని, హైదరాబాద్ జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధనలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ కొనసాగడం సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తోందని అన్నారు. పరిపాలనా ఖాళీలను వెంటనే భర్తీ చేసి, విద్యార్థుల ప్లేస్‌మెంట్ అవకాశాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గవర్నింగ్ బోర్డుల పదవీకాలం ముగిసిన తర్వాత కూడా అవి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం చట్టబద్ధమేనా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని, కొత్త బోర్డుల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని కౌన్సిల్‌ను కోరారు. బయో - శక్తి కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన జాతీయ బయోఅవైలబిలిటీ కేంద్రాల పనితీరు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వాటి ఫలితాలపై వివరాలు వెల్లడించాలని కోరారు. దేశ ఫార్మా రాజధానిగా పేరుగాంచిన హైదరాబాద్‌కు ఈ రంగంలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధనల్లో ఏర్పాటు చేసిన శ్రేష్ఠతా కేంద్రాలు సంఖ్య, వాటి బాధ్యతలు, పనితీరు, పరిశ్రమలకు అందిస్తున్న సేవలపై సమగ్ర సమాచారం వెల్లడించాలని కోరారు. "వికసిత భారత్-2047" లక్ష్యాలు, తెలంగాణ రాష్ట్రం నిర్దేశించుకున్న 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్య సాధనలో లైఫ్ సైన్సెస్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, మొహాలీ జాతీయ సంస్థాగత ఫార్మాస్యూటికల్ విద్య పరిశోధన మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రఘురాం రావు అక్కినేపల్లి వ్యవహారాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. కేసులో విముక్తి పొందినప్పటికీ ఆయనకు ఇప్పటికీ న్యాయం జరగలేదని పేర్కొంటూ, ఈ అంశాన్ని కేంద్ర మంత్రివర్యులు జె.పీ. నడ్డా దృష్టికి రెండుసార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రొఫెసర్ రఘురాం రావు అక్కినేపల్లికి కనీసం ఇప్పుడైనా న్యాయం చేయాలని కౌన్సిల్‌ను కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : సర్పంచ్ ఎల్లయ్య

### ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకోవాలి....

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యాలు సాధించుకోవాలని రాజపేట మండలం బొందుగుల గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య అన్నారు. సోమవారం రోజు బొందుగుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ఉపసర్పంచ్ అబ్దుల్ ఆబిద్ ఉప్పరి సిద్ధులు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు



# నివేధిత విద్యాభివృద్ధికి సహాయ సహకారం అందిస్తా : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**నివేధిత భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలి.....**

**నివేధిత ప్రతిభను అభినందించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య....**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రంగారెడ్డి జిల్లా మంచల్ మండలం అగపల్లి గ్రామానికి చెందిన గందమగుడెం నర్సింహా -- ప్రేమలత దంపతుల కుమార్తె నివేధితను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రత్యేకంగా కలుసుకుని అభినందించారు.ఇటీవల బీర్ల ఐలయ్య జన్మదినోత్సవం సందర్భంగా చిన్నారి నివేధిత తన సృజనాత్మక ప్రతిభను ప్రదర్శిస్తూ ఒక పళ్లెంలో ఉన్న నీటి ఉపరితలంపై ఐలయ్య చిత్రాన్ని అద్భుతంగా



రూపొందించింది. చిన్నారి ప్రతిభ, కళాప్రతిభను గుర్తించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆమెను స్వయంగా కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నివేధితకు శాలువాతో సత్కరించి, జ్ఞాపికతో పాటు ప్రత్యేక కానుకను అందజేశారు. చిన్న వయస్సులోనే ఇలాంటి అసాధారణ ప్రతిభ కనబరిచినందుకు ఆమెను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం నివేధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన బీర్ల ఐలయ్య, చిన్నారి విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆమె ఉన్నత చదువులు కొనసాగించేందుకు అవసరమైన సహాయం అందిస్తామని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు తెలియజేస్తూ, చిన్నారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గ్రామస్తులు కూడా నివేధిత ప్రతిభను ప్రశంసిస్తూ, ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# వృద్ధ దంపతులకు కళ్యాణం జరుపుతున్న ఉపాధి కూలీలు...

**ఉపాధి కూలీల మధ్య వృద్ధ దంపతుల వివాహ వేడుక....**

**కాల్వపల్లిలో గ్రామంలో ఐక్యత, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచిన సందడి......**

హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 15, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం కాల్వపల్లి ఉపాధి హామీ పనులకు వెళ్లిన కూలీలు పనులతో పాటు వినూత్నంగా వివాహ వేడుక నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. రాజపేట మండలం కాల్వపల్లి గ్రామ శివారులో ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలో గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు 70 సంవత్సరాలు ఉన్న కళ్లెం నరసయ్య -- 65 సంవత్సరాలు గల బాలమణిల వివాహాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి ఆనందోత్సవాలు జరుపుకున్నారు. ఉదయం నుంచే పనుల ప్రదేశాన్ని పండుగ వాతావరణంగా తీర్చిదిద్దిన కూలీలు మామిడి తోరణాలు కట్టి, రంగురంగుల అలంకరణలు చేశారు. డోలు వాయిద్యాల నడుమ వేదమంత్రోచ్ఛారణలతో వృద్ధ దంపతులను నవదంపతుల్లా అలంకరించి పూలమాలలు మార్చుకున్నారు. అనంతరం సంప్రదాయ పద్ధతిలో తాళిబొట్టు కట్టించి, తలంబ్రాలు పోయించి, ఏడడుగులు నడిపించారు. అప్పగింతలు, వడి బియ్యం పోయడం, లాంటి సాంప్రదాయ వివాహ తంతు వేడుకలను ఉపాధి కూలీలు రెండు గ్రూపులుగా



విడిపోయి చేపట్టారు. పెళ్లి తంతులో భాగంగా అరుంధతి నక్షత్రాన్ని చూపించి ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి కూలీలు వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూసంతోషం వ్యక్తం చేశారు. వృద్ధ దంపతులు కూడా ఈ వేడుకతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ కూలీలకు కృతజ్ఞతలు తెలిపారు. సాధారణంగా ఉపాధి పనుల ప్రదేశంగా ఉండే ప్రాంతం ఆ రోజు పెళ్లి వేడుకలతో కళకళలాడింది. పాటలు, నృత్యాలు, హాస్య వినోదాలతో కూలీలు రోజంతా ఉత్సాహంగా గడిపారు. గ్రామంలో ఐక్యత, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం స్థానికులను ఆకట్టుకోగా, ఉపాధి కూలీల సామాజిక చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. గ్రామస్తులు ఈ వినూత్న వివాహ వేడుకను అభినందిస్తూ, వృద్ధ దంపతులు నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. వివాహ తంతు వేడుకలను చేర్యాల సుగుణమ్మ



పురోహితురాలుగా వ్యవహరించి మంత్రాలు చదివి కళ్యాణ తంతును నిర్వహించారు. ఉపాధి కూలీ పరిసర ప్రాంతాల్లో లభించిన వస్తువులతోనే కల్యాణ తంతును చక్కగా నిర్వహించడం ప్రత్యేకత

**వైరల్ అవుతున్న కరువు పనిలో కళ్యాణం......**

కరువు పని కూలీలు పని అనంతరం సరదాగా కళ్యాణం చేసుకున్న వీడియో సోషల్ మీడియా తెగ వైరల్ అవుతున్నది. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన కరువు పని కూలీలు పని కోసం తెచ్చిన తట్టాల బాజా భజంత్రీ మధ్య తంగేడు పూలు, ఎరుపు కాగితాల పూలతో, మామిడి తోరణాల మధ్య కళ్యాణం చూడముచ్చటగా చేసుకున్న వీడియో ఇన్స్టాలో పోస్ట్ చేశారు. అడవిలో దొరికే ఆకులు పూలతో అలంకరణ కనువిందు చేసినది. ఆ వీడియో లైక్ లతో కామెంట్లతో తెగ వైరల్ అవుతున్నది.

# కాబో వెర్డె కేక..స్పెయిన్‌ను నిలువరించిన అరంగేట్రం జట్టు

అట్లాంటా: ఫిఫా వరల్డ్ కప్‌లో అతి పెద్ద సంచలనం. మాజీ చాంపియన్, ట్రోఫీ ఫేవరెట్లలో ఒకటైన స్పెయిన్‌ను ప్రపంచకప్ అరంగేట్ర జట్టు కాబో వెర్డె నిలువరించి ఔరా అనిపించింది. యూరోపియన్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన స్పెయిన్‌ను ప్రపంచంలోనే మూడో అతిచిన్న దేశమైన కాబో వెర్డె అడ్డుకోవడంతో సాకర్ ప్రపంచం అవాక్కైంది. సోమవారం హోరాహోరీగా సాగిన గ్రూప్-హెచ్ మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగిన ప్రపంచ మూడో ర్యాంకర్ స్పెయిన్‌తో పోరును 0-0తో డ్రా చేసిన 64వ ర్యాంకర్ కాబో వెర్డె తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే గొప్ప అధ్యాయాన్ని లిఖించింది. ఏకపక్షం అనుకున్న ఈ మ్యాచ్ అనూహ్య మలుపులు తిరుగుతూ అభిమానులను ఫిదా చేసింది. పలువురు స్టార్ ఆటగాళ్లతో బరిలోకి దిగిన స్పెయిన్ బంతిని 62 శాతం తమ నియంత్రణలోనే ఉంచుకున్నా.. లక్ష్యంపై 7 సహా మొత్తంగా 27 దాడులు చేసినా ఒక్కసారి కూడా సక్సెస్ కాలేకపోయింది.కాబో వెర్డె (304 పాస్‌లు)తో పోలిస్తే పాస్‌ల్లోనూ పూర్తి పైచేయి సాధించినా ఫలితం లేకపోయింది. అత్యద్భుతమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థి దాడులను టీమ్ సమర్థవంతంగా అడ్డుకోగలిగింది. ఆట చివర్లో ఇరు జట్ల మధ్య తీవ్ర ఉత్కంఠ నెలకొంది. 90వ నిమిషంలో కాబో వెర్డెకు మ్యాచ్‌లోనే తొలి కార్నర్ లభించగా.. డినీ బోర్జెస్ తలతో కొట్టిన బంతిని స్పెయిన్ కీపర్ ఉనై సిమోన్ చాకచక్యంగా అడ్డుకున్నాడు. ఆ తర్వాత 93వ నిమిషంలో కాబో ఆటగాళ్లు ముగ్గురు కలిసి స్పెయిన్ డిఫెన్స్‌పై కౌంటర్ ఎటాక్‌కు దూసుకెళ్లారు. ఆ దాడిని తిప్పికొట్టే క్రమంలో స్పెయిన్ స్టార్ మిడ్‌ఫీల్డర్ పెద్రి ఫౌల్ చేయాల్సి వచ్చింది. దీంతో రెఫరీ అతనికి ఎల్లో కార్డ్ చూపించాడు.మ్యాచ్ ఆఖరి క్షణాల్లో (90౦6వ నిమిషంలో) స్పెయిన్ ఆటగాడు మైకెల్ ఒయర్జబల్



కొట్టిన షాట్ మిస్ అవ్వడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఫుల్-టైమ్ విజిల్ పడగానే కాబో వెర్డె ఆటగాళ్లు తాము ప్రపంచ కప్‌నే గెలిచినంతగా సంబరాల్లో మునిగిపోయారు. మ్యాచ్ పొడవునా స్పెయిన్ దాడులను అడ్డుకుంటూ అద్భుత ప్రదర్శన చేసిన కాబో వెర్డె గోల్‌కీపర్ వోజిన్హా ఈ చారిత్రాత్మక ఫలితంతో వచ్చిన భావోద్వేగాన్ని తట్టుకోలేక మైదానంలోనే కన్నీరు పెట్టుకున్నాడు. స్పెయిన్ తమ గోల్ పోస్టుపై కొట్టిన ఏడు షాట్లను అడ్డుకున్న వోజిన్హా మొత్తం 65 టచ్‌లు, 15 బాల్ రికవరీలు చేసి మ్యాచ్ హీరోగా మారి ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఆకర్షించాడు.

**అయారి డబుల్ గోల్.. స్వీడన్ ఘన విజయం**

మాంటెర్రీ(మెక్సికో): తన తండ్రి పుట్టిన దేశంపై బరిలోకి దిగిన యువ స్ట్రయికర్ యాసిన్ అయారి డబుల్ గోల్స్‌తో విజృంభించడంతో ప్రపంచకప్‌లో స్వీడన్ అదిరిపోయే శుభారంభం చేసింది. గ్రూప్-ఎఫ్ పోరులో 5-1 తేడాతో ట్యునీషియాపై ఘన విజయం సాధించింది. గత మెగాటోర్నీకి అర్హత సాధించడంలో విఫలమైన స్వీడన్ ఈసారి పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. 39వ ర్యాంక్‌తో ప్రపంచకప్‌లో ప్రవేశించిన స్వీడన్..ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. యువ స్ట్రైకర్ యాసిన్ అయారి (7ని, 90౦6ని) రెండు గోల్స్‌తో సత్తా చాటగా.. అలెగ్జాండర్ ఇసాక్(30ని), విక్టర్ గ్యోకెరెస్(59ని), మథియస్ స్వాన్‌బెర్గ్(84ని) ఒక్కో గోల్ చేశారు. ట్యునీషియా తరఫున ఒమర్ రెకిక్(43ని) ఏకైక గోల్ చేశాడు. ఇదే గ్రూప్‌లో నెదర్లాండ్స్, జపాన్ మధ్య పోరు 2-2తో డ్రా అయింది. గ్రూప్-ఈ పోరులో ఐవరీకోస్ట్ 1-0తో ఈక్వెడార్‌పై గెలిచింది. అమద్ దియాలో(90ని) ఏకైక గోల్ చేశాడు.

# ఆసియా గేమ్స్‌కు సహజ



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఆసియా గేమ్స్‌లో భారత మహిళల టెన్నిస్ సవాల్‌ను తెలంగాణ అమ్మాయి, దేశ టాప్ ర్యాంక్ సింగిల్స్ ప్లేయర్ యమలపల్లి సహజ ముందుండి నడిపించనుంది. ఈ మెగా టోర్నీ కోసం ఆలిండియా టెన్నిస్ అసోసియేషన్ (ఏఐటీఏ) సోమవారం ప్రకటించిన ఆరుగురు సభ్యుల మహిళల జట్టుకు సహజ ఎంపికైంది. ప్రస్తుతం ప్రపంచ 332వ ర్యాంకులో సహజ ప్రస్తుత ఫామ్‌ను పరిగణనలోకి తీసుకున్న సెలెక్షన్ కమిటీ, ఆమెకు జట్టును నడిపించే బాధ్యతలను అప్పగించింది. వైష్ణవి అడ్కర్ (396వ ర్యాంక్), వైదేహి చౌదరి (417), రుతుజా భోసలే (125), ప్రార్థన తోంబరే(181), అంకిత రైనా (185) జట్టులో స్థానం సంపాదించారు. పురుషుల జట్టును ప్రపంచ 277వ ర్యాంకర్ సుమిత్ నగాల్ నడిపించనున్నాడు. సింగిల్స్‌లో నగాల్‌తో పాటు మానస్ ధామ్నే, దక్షిణేశ్వర్ సురేష్ ఎంపికవగా.. డబుల్స్ స్పెషలిస్టులుగా యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ, అనిరుధ్ చంద్రశేఖర్‌ను ఏఐటీఏ ఎంపిక చేసింది. కరణ్ సింగ్, రిత్విక్ బొల్లిపల్లి, నిక్కీ పూనాచా రిజర్వ్ ప్లేయర్లుగా ఉంటారు.

# రంగారెడ్డి రైజర్స్ కెప్టెన్‌గా తనయ్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: టీ20 లీగ్ తొలి సీజన్ లో రంగారెడ్డి రైజర్స్ జట్టు.. రంజీ క్రికెటర్ తనయ్ త్యాగరాజన్ కెప్టెన్సీలో బరిలోకి దిగనుంది. ఈ నెల 21వ తేదీ నుంచి ఉప్పల్ స్టేడియంలో జరిగే మెగా లీగ్ కోసం బలమైన జట్టును సిద్ధం చేసుకుంది. తనయ్ త్యాగరాజన్‌ను కెప్టెన్‌ను ఎంపిక చేసినట్టు సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆ ఫ్రాంచైజీ యజమానులు బి. రవికుమార్, సాయి సువీర్ రెడ్డి తెలిపారు. జట్టు లోగోను కూడా ఆవిష్కరించారు.నితిన్ సాయి యాదవ్ వైస్ కెప్టెన్సీ చేపట్టనుండగా.. హెడ్ కోచ్‌గా అభినవ్ కుమార్, మెంటార్‌గా తిలక్ వర్మను తీర్చిదిద్దిన కోచ్ సలామ్ భయాష్ వ్యవహరిస్తారని ఫ్రాంచైజీ తెలిపింది. సీనియర్లు, యువ ఆటగాళ్లతో తమ జట్టు బలంగా ఉందని కెప్టెన్ తనయ్ ఈ సందర్భంగా తెలిపాడు. కొన్ని రోజులుగా ముమ్మర ప్రాక్టీస్‌తో పాటు ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లు ఆడుతూ టీమ్ బాండింగ్ పెంచుకుంటున్నామని తెలిపాడు. లీగ్‌లో నిర్భయంగా ఆడి జట్టుకు మంచి పేరు తెస్తామని చెప్పాడు.

# భారత్-ఏకు భంగపాటు

దంబుల్లా : ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టుకు మరో షాక్ తగిలింది. తిలక్‌వర్మ సారథ్యంలోని జట్టు శ్రీలంక-ఏ చేతిలో అనూహ్యంగా ఓడిపోయింది. సోమవారం నాటకీయ పరిణామాల మధ్యసాగిన పోరులో భారత్ సూపర్ ఓవర్‌లో లంక చేతిలో పరాజయం పాలైంది. తొలుత ఇరు జట్ల స్కోర్లు సమం(265) కావడంతో విజేతను నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ అనివార్యమైంది. భారత బౌలర్ అర్షద్‌ఖాన్ వేసిన ఈ ఓవర్లో లంక వికెట్ నష్టపోకుండా 16 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత్-ఏ తరఫున సూర్యాంశ్ షెగ్డె, వైభవ్ సూర్యవంశీ ఆరు బంతుల్లో 9 పరుగులు మాత్రమే చేయడంతో జట్టుకు ఓటమి తప్పలేదు. అంతకుముందు భారత్-ఏ 49.2 ఓవర్లలో 265 పరుగులకు ఆలౌటైంది.సూర్యాంశ్ (72), విప్రాజ్ నిగమ్(51) అర ?ధసెంచరీలతో రాణించారు.ఎనిమిదో వికెట్‌కు 104 పరుగులు జోడించి జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం ఛేదనలో లంక ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లకు సరిగ్గా 265 రన్స్ చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. సదీరా సమరవిక్రమ (93) సత్తా చాటాడు. ఆఖరి ఓవర్లో లంక విజయానికి 5 పరుగులు అవసరం కాగా అర్షద్‌ఖాన్ అద్భుతమైన యార్కర్లతో నాలుగు పరుగులే ఇచ్చాడు. ఈ తరుణంలో సూపర్ ఓవర్‌పై సందిగ్ధత ఏర్పడింది. అంపైర్లతో కెప్టెన్ తిలక్ సుదీర్ఘ వాదనల తర్వాత మొదలైన సూపర్ ఓవర్‌లో భారత్-ఏ జట్టుకు నిరాశ తప్పలేదు. బుధవారం జరిగే తర్వాతి మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్‌తో భారత్-ఏ తలపడనుంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.